
ప్రజాశక్తి
శనివారం 18 జనవరి 2025 5
శ్రీ సత్యసాయి





బిఎస్ఎఫ్ జవాను వెంకటరమణారెడ్డి మృతదేహాన్ని మోసుకెళుతున్న పోలీసులు, ఆర్మీ

# నామినేటెడ్ ఆశలు



## త్వరలో భర్తీ చేయనున్నట్లు ప్రకటన
## ఈసారైనా దక్కేనా అని ఎదురు చూపులు

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

నామినేటెడ్ పదవుల పంపకాలు మరోమారు జరుగనుండటంతో ఆశావహుల్లో ఉత్కంఠత నెలకొంది. ఈసారి ఎవరికి పదవులు వర్తిస్తాయోనని ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే రెండు,మూడు దఫాల్లో నామినేటెడ్ పోస్టుల నియామకాలు జరిగాయి. అయితే ఇందులో జిల్లాలోని టిడిపి ముఖ్యనేతలకు పెద్దగా పదవులు దక్కలేదు. మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డికి రాష్ట్ర ఛైర్మన్ పదవి దక్కగా, మాజీ జడ్పి ఛైర్మన్ పూల నాగరాజుకు రీజనల్ ఛైర్మన్ పదవి దక్కింది. తక్కిన వారికి డైరెక్టరు పోస్టులే దిక్కయ్యాయి. ఉన్న జిల్లా స్థాయి అహుడా పోస్టు జనసేన నాయకులు టిసి.వరుణ్‌కు కూటమిలో భాగంగా ఇచ్చారు. ఇక తక్కిన ముఖ్యమైన పోస్టులేవి జిల్లాలో లేవు. దీంతో ఈసారి జరగబోయే నామినేటెడ్ పదవుల్లోనైనా జిల్లాకు ప్రాధాన్యతనిస్తారా లేదా అని ఆశావహులు ఎదురు చూస్తున్నారు. గతంలో ఎప్పుడూలేని విధంగా ఉమ్మడి జిల్లాలో ఈసారి తెలుగుదేశం పార్టీ 14 స్థానాల్లోనూ విజయం సాధించింది. విజయానికి కష్టపడిన నేతలకు ఈ పదవుల పంపకాల్లో గుర్తింపు లభిస్తుందన్న నమ్మకంతో పదవులపై ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తున్నారు. అయితే అధికారంలోనున్నది ఇప్పుడు మూడు పార్టీలు కలసి కాబట్టి సర్దుబాటుల్లో సర్దుకోవాల్సిందేనా అన్న నిరాశలోనూ కొంత మంది నేతలున్నారు.

**త్యాగం చేసిన వారికి ఇక అంతేనా ?**

2024 సార్వత్రిక ఎన్నికల్లో కొంత మంది సీనియర్లు తమ సీట్లను వదులుకుని పార్టీకి పనిచేశారు. వారికి ఇప్పటి వరకు ఎటువంటి ప్రాధాన్యత లభించలేదు. రాబోయే రోజుల్లోనైనా ఉంటుందా లేదా అని ఎదురు చూస్తున్నారు. ఈ రకంగా సిట్టింగు స్థానం వదలుకుని పార్టీ కోసం పనిచేసిన వారిలో అనంతపురం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ఉన్నారు. ఆయనకు గత అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్టు ఇవ్వలేదు. ఆయన స్వతంత్రంగా బరిలో దిగుతారన్న ప్రచారమూ నడిచింది .అయితే ఆయన పార్టీకి పనిచేస్తానని చెప్పడమే కాకుండా పనిచేశారు. ఇప్పుడు ఆయనకు ఏ రకంగా న్యాయం చేస్తారన్న చర్చ నడుస్తోంది. ఇక యువ నాయకుడు పరిటాల శ్రీరామ్ కూటమి పొత్తుల్లో భాగంగా ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గం టిక్కెట్టు వదులుకున్నారు. ఆయనకు రాష్ట్ర స్థాయి ఛైర్మన్ పదవి దక్కుతుందని ప్రచారం నడిచినప్పటికీ మరొకరి ఇచ్చారు. ఇక జెసి.పవన్‌కుమార్‌రెడ్డి 2019 ఎన్నికల్లో పార్లమెంటు స్థానానికి పోటీ చేసి ఓటమి చెందారు. 2024లో ఆయనకు టిక్కెట్టు ఇవ్వలేదు. వీరే కాకుండా గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే జితేందర్‌గౌడ్, మడకశిర మాజీ ఎమ్మెల్యే ఈరన్నలు కూడా టిక్కెట్టు వదులుకున్న వారిలోనున్నారు. వారికి ఇప్పుడు పార్టీ ఏ రకంగా ప్రాధాన్యతను కల్పించనుందన్నదన్న చర్చ నడుస్తోంది. వీరే కాకుండా అనేక ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్ నాయకులూ ఉన్నారు. వీరికి ఈసారైన తగిన గుర్తింపు లభిస్తుందా లేక ఎప్పటిలాగానే మొండిచెయ్యి తప్పదా అన్న చర్చ ఆ పార్టీలో నడుస్తోంది.

# బిఎస్ఎఫ్ జవానుకు అశ్రు నివాళి

**ప్రజాశక్తి - ధర్మవరం టౌన్**



వెంకటరమణారెడ్డి (ఫైల్‌ఫొటో)

పట్టణంలోని నాగుల బావి వీధి కు చెందిన బిఎస్ఎఫ్ జవానుతలమర్ల వెంకట రమణ రెడ్డికి పట్టణ ప్రజలతోపాటు వివిధ అధికారులు, పోలీస్ అధికారులు, కేంద్ర బలగాల నడుమ అశ్రు నివాళులు అర్పించారు. మృతుడు తలమర్ల వెంకట రమణారెడ్డి కాశ్మీర్లో విధులలో ఉన్నప్పుడు గుండెపోటుకు గురై మృతిచెందాడు. మృతదేహాన్ని కాశ్మీర్ నుండి ఢిల్లీకు, ఢిల్లీ నుండి బెంగళూరుకు, బెంగళూరు నుండి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆర్మీ వాహనంలో ధర్మవరానికి శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటలకు చేర్చారు. చిన్న వయసులోనే ఇంతటి ఘోరం చూడాల్సి వస్తుందని కుటుంబ సభ్యులు,బంధువులు చేస్తున్న రోదనలు పలువురుని కంటతడి పెట్టించాయి. దేశ సేవ చేయాలన్న తలంపుతోనే ఆర్మీలో చేరిన తలమర్ల వెంకటరమణారెడ్డి ఇంకొన్ని రోజుల్లో రిటైర్డ్ అయి వస్తాడన్న ఆశతో ఎదురు చూసామని అంతలోనే ఇలా జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో పాటు వైసిపి గుర్రం శ్రీనివాసరెడ్డి, చందమూరు నారాయణరెడ్డి, బ్రహ్మయ్య, మాసపల్లి సాయికుమార్, పట్టణంలోని వివిధ పోలీస్ స్టేషన్ లోని పోలీస్ సిబ్బంది, అధికారులు, తదితరులు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడినుంచి వెంకటరమణారెడ్డి న సొంత గ్రామమైన డివిజన్ పరిధిలోని చెన్నై కొత్తపల్లి మండలం బసినేపల్లి గ్రామం వద్దకు మృతదేహాన్నిచేర్చారు. అక్కడ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అధికారులు, గ్రామ పట్టణ ప్రజల నడుమ కేంద్ర బలగాలు ప్రభుత్వ ఆధ్వర్యంలో అంత్యక్రియలను నిర్వహించారు. పట్టణం నుండి చెన్నై కొత్తపల్లి వరకు వందలాదిమంది పాల్గొని బిఎస్ఎఫ్ జవానుకు తుది వీడ్కోలు పలికారు.



బిఎస్ఎఫ్ జవాను వెంకటరమణారెడ్డి అంతిమయాత్ర

# బెల్టు షాపుల్లో 'బాలయ్య'కూ వాటాలు

## వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక



విలేకరుల సమావేశంలో పాల్గొన్న వైసిపి నాయకులు

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం పట్టణంతోపాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మద్యం దుకాణాలు, వాటికి అనుసంధాంగా ఉన్న బెల్టు షాపుల నుంచి వస్తున్న మామూళ్లలో ఎమ్మెల్యే బాలకృష్ణకు వాటాలు ఉన్నాయని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక ఆరోపించారు. హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా మద్యం మాఫియా ఉందని విమర్శించారు. శుక్రవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో నాయకులతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. అడ్డంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్ ను మద్యాంధ్ర ప్రదేశ్ గా మార్చిందని విమర్శించారు. ఇక హిందూపురం నియోజకవర్గంలో అయితే ఏకంగా 70 కి పైగా బెల్ట్ షాపులు ఉన్నాయని అన్నారు. మద్యం దుకాణాల్లో, బెల్ట్ షాపుల్లో నిర్ణయించిన ధరల కన్నా అధిక ధరలకు అమ్మడంతో పాటు గోవా మహారాష్ట్రల నుంచి మద్యాన్ని దిగుమతి చేసుకొని అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇందులో ఎమ్మెల్యే బాలకృష్ణ పిఎలు వాటాలు తీసుకుని బాలకృష్ణకు పంపుతున్నారని ఆరోపించారు. నాణ్యమైన మద్యాన్ని అందించక పోగా ఇతర రాష్ట్రాల మద్యాన్ని తీసుకుని వచ్చి తెగ నమ్ముతూ, తెలుగు తమ్ముళ్ల సొమ్ము చేసుకుంటారని ఆరోపించారు. ఈ విషయాలపై బాలకృష్ణను సూటిగా ప్రశ్నిస్తున్నామన్నారు. హిందూపురంలో ఉన్న మద్యం దుకాణాలను టిడిపికి చెందిన ముఖ్య నాయకులవే అనిఇందులో ఏ ఒక్కరైనా వేరే వారికి గాని, సామాన్య ప్రజలకు గాని ఉన్నాయా అని ప్రశ్నించారు. అనుమతి లేని దుకాణాలకు సంబంధించి మాట్లాడితే చిలమత్తూరు మండలంలో ఒక దుకాణానికి అనుమతి పొంది చిలమత్తూరు పట్టణంలో ఒకటి, మరొకటి కొడికొండ చెక్ పోస్ట్‌లో నడుపుతున్నారని విమర్శించారు. బెల్టు షాపుల విషయానికి నియోజకవర్గంలోనిప్రతి పంచాయతీ, ప్రతి గ్రామం, ప్రతి వార్డులోను రెండు నుంచి మూడు షాపులు ఉన్నాయన్నారు. రెండు రోజుల క్రితం కోడికొండ చెక్ పోస్ట్ వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న ఒక లారీ దొరికితే గుట్టుచప్పుడు కాకుండా ఆ లారీని టిడిపి నాయకులు విడిపించారని ఆరోపించారు. కల్లు దుకాణాల విషయంలో నెలకు రూ 20 లక్షలు తీసుకొని ఎమ్మెల్యేకు పంపుతున్నట్లు, స్వయాన ఆయన పిఎలే బహిరంగంగానే చెబుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ జబీవుల్లా, నాయకులు నాగమణి, చాంద్ భాషా, శివ, రాము తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి ఆరోపణలు అర్థరహితం : టిడిపి

**ప్రజాశక్తి-హిందూపురం**

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక చేసిన ఆరోపణలు అర్థరహితమని టిడిపి నాయకులు అన్నారు. ఆమె ఆరోపణలను వారు తీవ్రంగా ఖండించారు. వైసిపి నాయకులు శుక్రవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మద్యం సిండికేట్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ విమర్శలను ఖండిస్తూ టిడిపి నాయకులు శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు రమేష్ కుమార్ మాట్లాడుతూ, వైసిపి ఇన్చార్జిగా కొనసాగుతున్న దీపిక బెంగళూరులో నివాసం ఉంటూ చుట్టం చూపుగా ఇక్కడికి వచ్చి అవగాహన లేకుండా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. మద్యం విషయంలో కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. టిడిపి నాయకులు సిండికేట్ గా మారి మద్యం వ్యాపారం చేస్తున్నారని ఆరోపణలు చేయడం తగదన్నారు. పట్టణానికి 9 షాపులు మంజూరు అయితే 175 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఇందులో లక్కీ డ్రా ద్వారా కేటాయింపులు జరిగాయని చెప్పారు. కేటాయింపులో పూర్తి పారదర్శకతతో ప్రభుత్వం చేపట్టిందని వీటిపై అవగాహన చేసుకొని మాట్లాడాలని అన్నారు. మద్యం షాపులు కేటాయింపులు జరిగిన తర్వాత కూటమి ప్రభుత్వం అధిక మద్యం ధరలు, అక్రమ మద్యం రవాణాకు సంబంధించి కేసుల నమోదు చేసి 11 మందిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. కళ్ళు దుకాణాలలో తనిఖీలు నిర్వహించి 11 మందిపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఇది వైసిపి నాయకులకు కనబడలేదా అని ప్రశ్నించారు. 5 సంవత్సరాల వైసిపి పాలనలో ఎన్ని కేసులు నమోదు చేశారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. బీసీ కార్డు పెట్టుకుని ఎన్నికలకు ముందు హిందూపురం వైసిపి ఇన్చార్జిగా వచ్చిన దీపిక పెన్నా నదిలో ఉన్న ఇసుకను జెసిబిలు పెట్టి లూటీ చేసి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. మరో మూడు నెలల్లో హిందూపురం అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామన్నారు. అభివద్ధికి అవసరమైన సలహాలు ఉంటే ఇవ్వాలని, అసత్య ఆరోపణలు చేయడం మానుకుని, వైసీపీలో ఉన్న అంతర్గత విభేదాలు చక్కదిద్దుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు పరిమళ, అమర్నాథ్, ఆర్ ఎం ఎస్ షఫీవుల్లా, ఇందాద్, అన్వర్, అబూబకర్, భాస్కర్, వెంకటేష్, బాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న టిడిపి నాయకులు

# ప్రతి మూడో శనివారం 'స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్'

## కలెక్టర్ టిఎస్. చేతన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్. చేతన్

**ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్**

ఇకపై ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించడానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో సంబంధిత హెచ్ఒడిలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ గా మార్చడానికి ఈ కార్యక్రమం చేపట్టారని ఇందులో మన జిల్లాలో కూడా స్వచ్ఛ జిల్లాగా ఏర్పడడానికి అధికారులు సన్నద్ధం కావాలని అన్నారు. ఈనెల 18న ముఖ్యమంత్రి కడప జిల్లా మైదుకూరులో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రమైన వాతావరణం, ప్రజా ఆరోగ్య పరిరక్షణ, కాలుష్య ప్రభావం తగ్గించడం, అహ్లాదకరమైన వాతావరణం కల్పించడం, ఆర్థిక ప్రయోజనాలు మెరుగుపరచడం, తదితర అంశాలతో కూడిన కార్యక్రమాలు ప్రతి మూడవ శనివారం నిర్వహించడం జరుగుతుందన్నారు. అందుకు అనుగుణంగా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులను ప్రజలను భాగస్వాములు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వెంకటసుబ్బయ్య, డిపిఒ సమత, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, గ్రామ వార్డు సచివాలయాల కోఆర్డినేటర్ శివారెడ్డి, కో-ఆపరేటివ్ అధికారి కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**రీసర్వే వినతుల అప్లోడ్, పరిష్కారం ఏక కాలంలో జరగాలి:**

వినతులను పిజిఆర్ఎస్‌లో అప్లోడ్ చేయడం, చేసిన వాటిని వెంటనే పరిష్కరించడం ఏక కాలంలో జరగాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో రీ సర్వే , రెవిన్యూ సదస్సులలో అందిన వినతులపై సర్వేయర్ల తో మండలాల వారిగా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ విజయ సారధి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే వినతుల పరిష్కారానికి మండల వారీగా లక్ష్యాలను ఇచ్చి వేగంగా పరిష్కారం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సర్వేయర్లు సక్రంగా పనిచేయాలని తెలిపారు ఆర్డీవోలుప్రతిరోజు సమీక్షించాలని, లక్ష్యాలకు అనుగుణంగా పని చేయని వారి ఇంక్రిమెంట్లను నిలుపుదల చేయాలని ఆదేశించారు. సర్వే శాఖ ఏడీ కూడా ప్రతి రోజు పర్యవేక్షించాలన్నారుజ ఈసందర్భంగా సర్వేయర్ల పని తీరు పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసారు. రెవిన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులలో డూప్లికేషన్ తీసేసి మిగిలిన వాటిని పిజిఆర్ఎస్ లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. శనివారం సాయంత్రం లోపల మొత్తం అప్లోడ్ చేయాలన్నారు. ఇపటికే పరిష్కారం చేసిన వినతులను డిప్యూటీ కలెక్టర్లు ఆడిట్ చేయాలని, ఒక్క వినతికి తప్పుడు సమాధానం ఇచ్చినా సంబంధిత అధికారి పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవిన్యూ వినతులను సబ్జెక్టు వారీగా వర్గీకరించి ఆర్‌డిఒలు పంపాలని, డిఆర్ఒ వాటి పరిష్కారానికి ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు పుట్టపర్తి సువర్ణ, పెనుగొండ ఆనంద్, కదిరి శర్మ, ధర్మవరం మహేష్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# సబ్ రిజిస్ట్రార్,సీనియర్ అసిస్టెంట్‌పై వేటు

**ప్రజాశక్తి - చిలమత్తూరు**

గోరంట్ల మండలానికి సంబందించిన ఫ్రీహోల్డ్ భూములు రిజిస్ట్రేషన్ చేసిన విషయంలో చిలమత్తూరు సబ్ రిజిస్టర్ వెంకటనారాయణతో పాటు సీనియర్ అసిస్టెంట్ కుళ్లాయ స్వామిని సస్పెండ్ చేసినట్లు డిఐజి విజయకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు సంబందించి బాధితులు శ్రీ సత్యసాయిజిల్లా కలెక్టర్‌కు గతంలో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుతో స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఫ్రీహోల్డ్‌భూముల రిజిస్ట్రేషన్‌కు సంబందించి అధికారులు విచారణ చేపట్టి నివేదిక అందజేశారు. ఆ నివేదిక ఆధారంగా సబ్‌రిజిస్ట్రార్ వెంకటనారాయణను, సీనియర్ అసిస్టెంట్ కుళ్లాయస్వామిని సస్పెండ్ చేస్తూ డిఐజి విజయకుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

## నేడు నవోదయ ప్రవేశ పరీక్ష : డిఇఒ

**ప్రజాశక్తి-కొత్తచెరువు**

జిల్లా వ్యాప్తంగా శనివారం నవోదయ విద్యాలయ సమితి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డిఇఒ కృష్ణప్ప తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 7,987 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 19 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకూ ఉంటుందన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని, ఆ తర్వాత అనుమతించరని ఆయన తెలిపారు.

# వేమన జయంతిని విజయవంతం చేద్దాం

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం పట్టణంలో ఈ నెల 19న నిర్వహించే యోగి వేమన జయంతి వేడుకలను విజయవంతం చేద్దామని రెడ్డి జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. ఈ వేడుకలకు రెడ్డి సోదర, సోదరీమణులు తరలి రావాలని కోరారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రెడ్డి జిల్లా అధ్యక్షులు సడ్లపల్లి వెంకటేష్ రెడ్డి, పరమేష్ రెడ్డి సుబ్బిరెడ్డి, సింగిరెడ్డిపల్లి శ్రీనివాస్ రెడ్డి, సడ్లపల్లి శబరీష్ రెడ్డి, ఎంపిటిసి రామకష్ణారెడ్డి, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, మోతుకపల్లి చంద్రశేఖర్ రెడ్డి, పూలకుంట నంజి రెడ్డి, బయపరెడ్డి రెడ్డి మాట్లాడారు. రాజకీయ పార్టీలకతీతంగా నిర్వహిస్తున్న ఈ జయంతి వేడుకలకు పార్టీలకు హోదాలకు అతీతంగా ప్రతి ఒక్క రెడ్డి సోదర, సోదరీమణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# న్యాయస్థానాల భవనాలు మార్పు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం పట్టణంలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, అదనపు జూనియర్ సివిల్ జడ్జ్, ప్రత్యేక మెజిస్ట్రేట్, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయస్థానాల భవన సముదాయాల మార్పు జరిగాయి. ప్రస్తుతం ఉన్న ఆయా న్యాయస్థానాల భవన సముదాయాలు శిథిలావస్థకు చేరుకోవడంతో హైకోర్టు ఆదేశాల మేరకు పశుసంవర్ధక వైద్యశాల భవన సముదాయంలోని 2,3వ అంతస్తుల్లోకి మార్పు చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ నేతత్వంలో ఆయా కోర్టు సముదాయాల్లో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్, ప్రిన్సిపల్ జూనియర్ సివి జడ్జి రాజ్యలక్ష్మి, జూనియర్ సివిల్ జడ్జి లలిత లక్ష్మి, ఏపీపీలు ఇందాద్, నగేష్, ఏజీపీ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ వన్నెరప్ప, ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ సిద్దు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, సీనియర్ న్యాయవాదులు రామచంద్రారెడ్డి, సుదర్శన్, నాగరాజు రెడ్డి, నాగేంద్ర, సత్యనారాయణ, మురళి, ఉదయ్ సింహారెడ్డి, పీవీ శ్రీనివాస్ రెడ్డి, అబ్దుల్లా, రకీబ్, రవిచంద్రలతో పాటు ఆయాకోర్టుల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## 19న మూర్ఛ చికిత్సా శిబిరం

**ప్రజాశక్తి-హిందూపురం**

జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఈ నెల19వ తేదీ ఆదివారం ఉచిత మూర్ఛ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు జెవివి ప్రతినిధులు రామకృష్ణ, డాక్టర్ ఈటి రామ్మూర్తి తెలిపారు. పట్టణంలోని ఆర్పీజిటీ రోడ్డులో ఉన్న అల్ హిలాల్ పాఠశాల ఆవరణలో ఉదయం 10 గంటలకు వైద్య శిబిరం జరుగుతుందన్నారు. మూర్ఛవ్యాధి గ్రస్తులు తగిన జాగ్రత్తలు పాటిస్తే జీవితాన్ని సంతోషంగా గడపవచ్చని అన్నారు. తమ రోజు వారీ జీవన విధానంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీరి కోసం జెవివి ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా చికిత్సా శిబిరాలను నిర్వహిస్తున్నామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఘనంగా జ్యోతుల ఉత్సవం

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం మున్సిపల్ పరిధిలోని చౌడేశ్వరి కాలనీలో శుక్రవారం పంచమ జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రాజు, స్థానిక కౌన్సిలర్ రామచంద్ర, గ్రామ పెద్దలు వేణుగోపాల్, భాను ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



## బాల్య వివాహాల నియంత్రణ అందరి బాధ్యత : ఆర్డీవో

**ప్రజాశక్తి-కదిరి టౌన్**

బాల్య వివాహాల నియంత్రణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని ఆర్డీవో వెంకట సన్యాసి శర్మ సూచించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ఆర్డీవో శర్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా మండల స్థాయి బాల్య వివాహ నిరోధక అధికారులు, తలుపుల, తనకల్లు, నల్లచెరువు, కదిరి, ఎన్‌పి కుంట, గాండ్లపెంట, అమడగూరు తహశీల్దార్లు, ఎంపిడిఒలు హాజరయ్యారు. ఆర్డీవో మాట్లాడుతూ బాల బాలికలకు చిన్న తనంలో వివాహం చేయడం వల్ల తలెత్తే దుష్పరిణామాలు, అనారోగ్య సమస్యల గురించి వివరించారు. బాల్య వివాహ నిరోధక చట్టం 2006, జీవో-31 అమలు, చట్టంపై క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాల్యవివాహ నియంత్రణకు అన్ని విభాగాల్లో అమలవుతున్న కార్యకలాపాలు, మండల, గ్రామస్థాయి సమావేశాల తేదీలు, బాల్యవివాహ నిర్మూలనకు భవిష్యత్తులో చేపట్టాల్సిన ప్రణాళికలపై చర్చించారు. బాల్య వివాహాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలు చైతన్య పరచాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శర్మ

## విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్రం ఊపిరిపోసింది : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-మడకశిర**

విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం ఊపిరి పోసిందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రజలు అనేక పోరాటాలు, ఆత్మార్పణ చేసి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్రం రూ. 11,400 కోట్లు ఆర్థికసాయం ప్రకటించడం హర్షణీయమన్నారు. గత ఐదేళ్ల విశాఖ ఉక్కును గాలికొదిలేసిన జగన్ రెడ్డి అండ్ కో వైఫల్యాన్ని విశాఖ, ఉత్తరాంధ్ర ప్రజలు గ్రహించారన్నారు. ఏపిలో సిఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం విశాఖ ఉక్కును కాపాడేందుకు చేసిన కృషి కేంద్రం చేసిన ప్రకటనతో ఫలించిందన్నారు. విశాఖ ఉక్కును కాపాడిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కేంద్రం సహకారంతో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు.



బత్తలపల్లిలో సమావేశమైన 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

**ప్రజాశక్తి-బత్తలపల్లి**

బత్తలపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో 1999-2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత శుక్రవారం స్థానిక గుండా కళ్యాణమండపంలో ఆత్మీయ సమావేశమయ్యారు. రోజంతా చిన్న నాటి కబుర్లతో ఆనందోత్సాహాల మధ్య గడిపారు. పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ సంతోషంగా గడిపారు. మధ్యాహ్నం విందు ఆరగించారు. ఇకపై ఏటా స్నేహితులందరం కలవాలని నిర్ణయించుకున్నారు. ఒకరి కష్టాల్లో మరొకరు పాలుపంచుకునే విధంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకున్నారు. కార్యక్రమంలో జె.నారాయణస్వామి, బత్తల రవికుమార్, ముల్లగూరు చిరంజీవి, రాగి నారాయణస్వామి, జొన్నలగడ్డ రంగనాయుడు, జ్వాలాపురం నరేష్, చికెన్ సెంటర్ దాదా, గుమ్మలకుంట సురేష్, బోయపాటి రాము, పొత్తూరు వెంకటరమణ, జాంపుల సురేష్, జాంపుల వేణు పాల్గొన్నారు.

## ప్రమాద బీమా చెక్కు అందజేత

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

ఎస్‌బిఐ ఖాతాదారులందరూ ప్రమాద బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బిఐ రీజినల్ మేనేజర్ శశిధర్ సూచించారు. పట్టణంలోని కాయగూరల మార్కెట్ వద్ద ఉన్న ఎస్‌బిఐ ప్రధాన శాఖలో శుక్రవారం మండలంలోని గొట్లూరు గ్రామానికి చెందిన రామాంజనేయులుకు ప్రమాద బీమాకు చెందిన రూ. 20 లక్షల చెక్కును అందజేశారు. ఆర్ఎం మాట్లాడుతూ రామాంజనేయులు భార్య రత్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిందని, ఆమె ఎస్‌బిఐలో ప్రమాద బీమా చెల్లించడం వల్ల ఈ లబ్ధి చేకూరిందని తెలిపారు. ఈ సదుపాయాన్ని బ్యాంకు ఖాతాదారులందరూ వినియోగించుకోవాలని చీఫ్ మేనేజర్ సందీప్ తెలిపారు. ఎస్‌బిఐ సామాజిక సేవా దృక్పథంతో తక్కువ ప్రీమియంతో బీమా అందిస్తుందని చీఫ్ మేనేజర్ వైవిఆర్ నాయుడు తెలిపారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు సాయికుమార్‌కు సన్మానం

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

ఇటీవల వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన మాసపల్లి సాయికుమార్‌ను శుక్రవారం ఆ పార్టీ నాయకులు పట్టణంలోని సాయికుమార్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలు, పూలబొకేలతో సన్మానించారు. వైసిపి మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు గజ్జల శివ, కౌన్సిలర్లు చింతా ఎల్లయ్య, కాలంగి శ్రీనివాసులు కేక్ కట్ చేశారు. అనంతరం మాసపల్లి సాయికుమార్‌కు పూలబొకేలు ఇచ్చి శాలువాలతో సన్మానించారు. వారు మాట్లాడుతూ సాయికుమార్‌ను వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించడం హర్షణీయమన్నారు. సాయికుమార్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో పార్టీ అధినేత వైఎస్.జగన్మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఓం, దాము, కుమార్, శివ పాల్గొన్నారు.



సాయికుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న వైసిపి నాయకులు

## మహిళపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి : వ్యకాసం

**ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్**

పెనుకొండ మండలంలోని మునిమడుగు గ్రామంలో మహిళపై అమానుషంగా దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. మండలంలోని మామిళ్లకుంట క్రాస్‌లో శుక్రవారం వ్యకాసం జిల్లా కోశాధికారి సాకే వెంకటేష్ మాట్లాడుతూ మహిళపై దాడికి పాల్పడిన వ్యక్తులు ఎంతటి వారైనా తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. మహిళలపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. బాధితురాలికి రక్షణ కల్పించి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆ ఘటనను ఖండిస్తూ శనివారం జిల్లా వ్యాప్తంగా వ్యకాసం ఆధ్వర్యంలో నిరసనకు పిలుపునిచ్చామన్నారు. కార్యక్రమంలో వ్యకాసం నాయకురాలు కురుబ రమాదేవి, వెంకటేష్, మణి, అనిత, పెద్దక్క, భాగ్యమ్మ, పోతక్క, గౌరమ్మ, చిన్ననాగమ్మ పాల్గొన్నారు.

**పుట్టపర్తి క్రైమ్ :** మునిమడుగు గ్రామంలో మహిళపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సిఐటియు మండల కన్వీనర్లు పైపల్లి గంగాధర్, పెడపల్లి బాబా డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ బాధితురాలికి రక్షణ కల్పించి ఆ కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా మహిళా సంఘం, కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో నిరసనకు పిలుపునిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం యూనియన్ నాయకులు రమేష్, సుధాకర్ పాల్గొన్నారు.

## అటవీశాఖ అధికారిపై వ్యాపారుల ఫిర్యాదు

**ప్రజాశక్తి-మడకశిర**

నియోజకవర్గంలో పనిచేస్తున్న అటవీశాఖ అధికారి కుళ్లాయప్ప డబ్బులు డిమాండ్ చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని కట్టెల వ్యాపారులు వీరభద్రప్ప, రంగస్వామి శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి ఫిర్యాదు చేశారు. వ్యాపారులు మాట్లాడుతూ అటవీ శాఖ అధికారి కుళ్లాయప్ప డబ్బులు కట్టించుకొని రశీదు ఇవ్వకుండా మళ్లీ మళ్లీ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని వాపోయారు. తాము అనంత నారాయణ కట్టెల మిల్లు యజమాని నుంచి కొనుగోలు చేసి కట్టెల మిల్లు నడుపుతున్నామని, అయితే ఆ అధికారి డబ్బులు తరచూ డబ్బులు ఇవ్వాలని లేకపోతే అక్రమ కేసులు బనాయిస్తానని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 అక్టోబర్ నుంచి దాదాపు రూ. లక్ష కు పైగా ఆ అధికారికి కట్టామని అయితే ఆయన రశీదు ఇవ్వలేదని తెలిపారు. స్పందించిన గుండుమల ఫోన్ ద్వారా ఆయా విషయాలను డిఎఫ్ఒకు వివరించారు. తక్షణమే అటవీశాఖ అధికారిపై విచారణ చేపట్టి, బాధితులకు న్యాయం చేయాలని గుండుమల డిఎఫ్ఒను కోరారు.



ఆర్అండ్‌బి డీఈ లక్ష్మీనారాయణ సన్మానిస్తున్న స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ గుండుమల జయప్ప

## ఆర్అండ్‌బి డీఈ బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి-మడకశిర**

పట్టణంలోని ఆర్అండ్‌బి విశ్రాంతి భవనంలో శుక్రవారం ఉదయం ఆర్అండ్‌బి డీఈగా లక్ష్మీ నారాయణ బాధ్యతలు చేపట్టారు. అనంతరం స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ గుండుమల జయప్ప నూతన డీఈని మర్యాద పూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. డీఈ మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ ఉమాశంకర్, తెలుగు యువత నాయకుడు తిమ్మరాజు, ఉమేష్, సోము, రవి, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

## తొలగించిన విఒఎలకు న్యాయం చేయాలి: సిఐటియు

**ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్**

తొలగించిన విఒఎలకు న్యాయం చేయాలని, బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని ఐకెపి యానిమేటర్స్ యూనియన్ సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డిఆర్‌డిఎ వెలుగు కార్యాలయం ముందు నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ రాజకీయ నాయకుల ఒత్తిళ్ల మేరకు ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న విఒఎలను తొలగించి కొత్తవారిని తీసుకోవడం అన్యాయమన్నారు. బకాయిలు చెల్లించలేదన్నారు. పాత విఒఎల విధులకు ఆటంకం కలిగించరాదని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా అధికారులు ఖాతరు చేయడం లేదన్నారు. కొత్తగా నియమితులైన వారికి అధికారులు సహకరిస్తు న్నారన్నారు. ఈ విషయాలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఇకనైనా జిల్లావ్యాప్తంగా తొలగించిన విఒఎలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్‌డిఎ పిడి నరసయ్యకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సిఐటి నాయకుడు బ్యాళ్ల అంజి, యానిమేటర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ రంగానాయక్, కో కన్వీనర్ వెంకటరాముడు, కమిటీ సభ్యులు అశ్విని, సుజాత, మాధవి, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



డిఆర్‌డిఎ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న నాయకులు

## మంత్రి సవిత వ్యాఖ్యలపై మాజీ మంత్రి ఉషశ్రీ ఫైర్

**ప్రజాశక్తి-సోమందేపల్లి**

ఇటీవల నిర్వహించిన సంక్రాంతి పోటీల్లో మంత్రి సవిత మాజీ సిఎం జగన్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం తగదని వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ మండిపడ్డారు. స్థానిక చౌడేశ్వరీ కళ్యాణ మండపంలో శుక్రవారం వైసిపి వార్డు కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉషశ్రీ మాట్లాడుతూ మంత్రి సవిత కబడ్డీ కూతలో 'నీకు పదిహేను వేలు, నీకు పదిహేను వేలు.. ప్రజలను మోసం చేసాం, ప్రజలను మోసం చేసాం' అని కూత పెట్టి ఆడాల్సిందని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఫ్లెక్సీల చించివేతపై మాట్లాడుతూ ఫ్లెక్సీల్లో ఉన్న జగన్ బొమ్మను తీసివేస్తారేమో కానీ ప్రజల గుండెల్లో ఉన్న ఆయన అభిమానాన్ని తీసివేయలేరన్నారు. వైసిపి హయాంలో జగన్ ఇచ్చిన మాటకు కట్టుబడి అన్ని హామీలు నెరవేర్చారని, మీరు బూటకపు హామీలు ఇచ్చి గద్దనెక్కారని విమర్శించారు. ఇకనైనా జగన్ నామస్మరణ మాని ఎన్నికల హామీల అమలుపై శ్రద్ధ పెట్టాలని మంత్రి సవితకు హితవు పలికారు. అనంతరం శివానగర్‌లో వైసిపి వార్డు కమిటీని నియమించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గజేంద్ర, టౌన్ కన్వీనర్ గోవిందమ్మ గారి శ్రీనివా సులు, జడ్పిటిసి అశోక్, సీనియర్ నాయకులు రమాకాంత్‌రెడ్డి, కంబాలప్ప పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్

## మంత్రిని విమర్శించే అర్హత ఉషశ్రీకు లేదు : టిడిపి

**ప్రజాశక్తి-పెనుకొండ**

మంత్రి సవితను విమర్శించే అర్హత వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌కు లేదని టిడిపి నాయకులు తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉషశ్రీచరణ్ మంత్రి సవితపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అసత్య ప్రచారం చేయడం ఉషశ్రీకే దక్కుతుందన్నారు. ఇసుక గురించి మాట్లాడే అర్హత ఉషశ్రీకి గాని వైసిపి నాయకులకు గానీ లేదన్నారు. వైసిపి హయాంలో బెంగళూరుకు అక్రమంగా ఇసుక రవాణా చేసింది, ల్యాండ్ సెటిల్మెంట్లు చేసి రూ. కోట్లు ఆర్జించింది, మంత్రి సవిత కంకర క్వారీని సీజ్ చేయించింది మీరు కాదా అని ప్రశ్నించారు. మంత్రి సవిత ఈ 6 నెలల్లోనే ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. మునిమడుగులో మహిళపై జరిగిన దాడిని టిడిపి ఖండిస్తుందని, ఈ దాడికి వైసిపి నాయకులే కారణం అన్నారు. పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. ఉషశ్రీ అసత్య ప్రచారాలు, అమంకార పూరిత వ్యాఖ్యలు చేస్తే నియోజకవర్గ ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు. సమావేశంలో టిడిపి కన్వీనర్లు శ్రీరాములు సిద్దలింగప్ప, మునిమడుగు వెంకటరాముడు, అశ్వర్థనారాయణ, రమణమ్మ, రఘువీర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

### 'కెహెచ్' కళాశాలకు న్యాక్ బి ప్లస్ గ్రేడ్

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

పట్టణంలోని కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ బృందం బి ప్లస్ గ్రేడ్ ఇచ్చిందని ప్రిన్సిపల్ డా. కె.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపి బి.ఎ.పార్థసారథి, సిపిడిసి మెంబర్లు, మున్సిపల్ అధికారులు, పట్టణ ప్రముఖులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రుల సహకారం వల్ల సి గ్రేడ్ నుంచి బి ప్లస్ గ్రేడ్ సాధించామన్నారు. కళాశాలలో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పడానికి ఈ గ్రేడ్ మరింత దోహదపడుతుందని సంతోషం వ్యక్తం చేశారు.

### నేడు రక్తదాన శిబిరం : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-నల్లచెరువు**

టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా శనివారం కదిరి పట్టణంలోని మదనపల్లి రోడ్డులో ఉన్న పివిఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. ముందుగా కదిరి మున్సిపల్ ఆఫీస్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తామన్నారు. అక్కడి నుంచి ర్యాలీగా పివిఆర్ ఫంక్షన్ హాల్‌కు చేరుకుంటామన్నారు

### నేడు ఎన్టీఆర్ వర్ధంతి

**ప్రజాశక్తి-గుడిబండ**

గుడిబండలో శనివారం నిర్వహిస్తున్న టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టిడిపి మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, శివకుమార్, జిల్లా వీరశైవ లింగాయత్ అధ్యక్షులు దుర్గేష్ కోరారు. వారు మాట్లాడుతూ తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తామన్నారు.

### పెనుకొండ-బెంగళూరు బస్సు వేళలు మార్పు

**ప్రజాశక్తి-పెనుకొండ**

పెనుకొండ నుంచి బెంగళూరు వెళ్లే ఆర్టీసీ బస్సు వేళలు మార్పు చేసినట్లు డిపో మేనేజర్ రామసుబ్బయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ ప్రజల కోరిక మేరకు పెనుకొండ డిపో నుంచి ఉదయం 7.30 గంటలకు బయల్దేరు బెంగళూరు బస్సు సర్వీసు ఇకపై ఉదయం 5.30 గంటలకు పెనుకొండలో బయల్దేరి 9గంటలకు బెంగళూరు చేరుతుందన్నారు. అక్కడ 9.15కి బయల్దేరి 14.15 గంటకు అనంతపురం చేరుతుందన్నారు. మళ్లీ 14.45 గంటలకు అనంతపురంలో బయల్దేరి 16.15 గంటలకు పెనుకొండ డిపోకు చేరుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ తెలిపారు.

### టిడిపి కార్యకర్తకు ఆర్థికసాయం

**ప్రజాశక్తి-పరిగి**

మండలంలోని బోరెడ్డిపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త బాబాజాన్ కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మంత్రి సూచన మేరకు శుక్రవారం స్థానిక టిడిపి నాయకులు బాబ్‌జాన్ ఇంటికెళ్లి పరామర్శించి అతడి వైద్య ఖర్చులకు రూ. 26వేలు అందించారు. నాయకులు మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలకు ఎప్పుడూ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆర్థిక సాయం అందించిన వారిలో మహేష్, హనుమయ్య, చౌడప్ప, నాగభూషణ, మారుతిప్రసాద్, ప్రవీణ్‌రెడ్డి, వడ్డే శ్రీనివాసులు ఉన్నారు.

### మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న ఆంజనేయులు అకస్మా త్తుగా మృతి చెందాడు. ఈ విషయం తెలిసి శుక్రవారం డోలా రాజారెడ్డి వార్డు కార్యకర్తలతో కలిసి ఆంజనేయులు ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5వేలు అందజేశారు. డోలా రాజారెడ్డి మాట్లాడుతూ మీ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట బిజెపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

### కుష్టు నిర్మూలనపై అవగాహన సదస్సు

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంపై శుక్రవారం పట్టణంలోని ఎన్జీవో కార్యాలయంలో ధర్మవరం డివిజన్‌లోని వైద్యాధికారులు, లెప్రసీ నోడల్ అధికారులకు జిల్లా కుష్టు నివారణ అధికారి తిప్పయ్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిప్పయ్య మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు అర్బన్, రూరల్ ప్రాంతాల్లో సర్వే చేపడతామన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు, వ్యాప్తి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సెల్వియా సాల్మన్, డిపిఎంఒలు రమణారెడ్డి, కుమార్‌రెడ్డి, పిపిఎం కోఆర్డినేటర్లు నాగేంద్ర, ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### సజావుగా సర్వసభ్య సమావేశం

**ప్రజాశక్తి-చిలమత్తూరు**

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిపి పురుషోత్తమరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలకృష్ణ సారథ్యంలో మండలంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. విద్యుత్ శాఖ నుంచి ఎవరూ హాజరు కాకపోవడంతో సమావేశానికి హాజరుకాని శాఖల అధికారులపై చర్యలు తప్పవని ఎంపిడిఒ రమణమూర్తి తెలిపారు.

### టిడిపిలో పలువురు చేరిక

**ప్రజాశక్తి-మడకశిర**

రొళ్ల మండలంలోని కాకి పంచాయతీలో శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో పలువురు నాయకులు వైసిపి నుంచి టిడిపిలో చేరారు. కాకి పంచాయితీలోని లక్కప్పనపల్లి గ్రామానికి చెందిన రంగప్ప, రామన్న, సిద్ధరాజు, జగన్నాథ్, సోమశేఖర్‌తో పాటు ఐదు కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరగా గుండుమల పసుపు కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో కుంచిటి ఒక్కలిగ రాష్ట్ర కన్వీనర్ వి.ఎం.పాండురంగప్ప, టిడిపి సీనియర్ నాయకులు సిద్ధగంగప్ప, నరసింహమూర్తి, రామకృష్ణ, ఉమేష్, అనిల్‌కుమార్, హేమంత్, పాల్గొన్నారు.

### ఆలయ పునరుద్ధరణకు విరాళం

**ప్రజాశక్తి-తాడిమర్రి**

మండలంలోని నిడిగల్లు గ్రామంలో వెలసిన పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునరుద్ధరణ కోసం శుక్రవారం ఉమ్మడి అనంతపురం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు నిడిగల్లు సర్పంచి గోనుగుంట్ల భూషణ్ రూ. లక్ష విరాళం ప్రకటించారు. ఆ మొత్తాన్ని భూషణ్ తన తండ్రి గోనుగుంట్ల వెంకటరాముడు చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. భూషణ్ మాట్లాడుతూ గ్రామంలో ఆలయాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు.

### రోడ్డు భద్రతపై డ్రైవర్లకు అవగాహన

**ముదిగుబ్బ :** జాతీయ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ముదిగుబ్బ లో కదిరి ఎంవిఐ వరప్రసాద్, సిఐ శివరాముడు డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాల న్నారు. 18 ఏళ్లు పైబడి డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు దరఖాస్తు చేసుకోవాల న్నారు. మైనర్లు వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. .

### రవీంద్రభారతిలో విద్యార్థుల నృత్య ప్రదర్శన

**పుట్టపర్తి రూరల్ :** సంక్రాంతి సందర్భంగా నృత్యాలయ నాట్య కళా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శుక్రవారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలో ధర్మవరం పట్టణానికి చెందిన బాపూ బాలాజీ శిష్య బృందం నృత్య ప్రదర్శనలతో అలరించారు. హర్షశ్రీ, రామలాలిత్య, గుర్రంపాటి హెమీష, రితిమ, జయప్రణీతతో పాటు 35 మంది విద్యార్థులు నృత్య ప్రదర్శలతో ఆకట్టుకున్నారు. వీరు నృత్యాలయ నాట్య కళా వెల్ఫేర్ సొసైటీ, సిరి ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ వీరేష్ యాదవ్, సినీ గేయ రచయిత నిర్వాగ్నశర్మ, రాజకీయ నాయకుల నుంచి నాట్యమయూరి, నంది అవార్డులు అందుకున్నారు.

## హోమియోపతి వైద్యాధికారిగా జ్యోతార్చన

**ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్**

పుట్టపర్తి ప్రభుత్వ హోమియోపతి వైద్యాధికారిగా డాక్టర్ జ్యోతార్చన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉన్న వైద్యుడు కృష్ణయ్య ఉద్యోగ విరమణ పొందారు. ఆ స్థానంలో డాక్టర్ జ్యోతార్చన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డాక్టర్ కృష్ణయ్యతో పాటు పలువురు ఆమెకు పూలమొక్కలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ జ్యోతార్చన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్యం అందించడానికి కృషి చేస్తారని తెలిపారు. సత్యసాయి బాబా నడయాడిన ప్రాంతంలో పని చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.



డాక్టర్ జ్యోతార్చనకు స్వాగతం పలుకుతున్న డాక్టర్ కిష్టయ్య

### ఏర్పాట్లు పరిశీలన

**ప్రజాశక్తి-తాడిమర్రి**

స్థానిక చెరువు కట్ట సమీపంలో ఈ నెల 19, 20 తేదీల్లో జరిగే జిల్లా స్థాయి ఇస్తేమా ఏర్పాట్లను శుక్రవారం డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్ఐ కృష్ణవేణి పరిశీలిం చారు. ప్రార్థనలు జరిగే ప్రదేశం, వాహనాల పార్కింగ్, తదితర తదితర వివరాలను స్థానిక ముస్లిం మత పెద్దలను అడిగి తెలుసుకున్నారు. అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఇస్తేమాను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. ఆ రెండు రోజుల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వారితో పాటు ముస్లిం మత పెద్దలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ, ఎస్ఐ

### ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

**ప్రజాశక్తి-మడకశిర**

రాష్ట్ర ఎంప్లాయిస్ ఫెడరేషన్(ఆర్ఇఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రామచంద్రను శుక్రవారం పట్టణంలో ఘనంగా సన్మానించారు. రామచంద్ర శుక్రవారం మడకశిరలో పర్యటించగా తాలూకా నాయకులు కె.భూతన్న, వివిఎన్.మాలింగప్ప, వై.జోగప్ప, మూడ్లగిరియప్ప, బి.ఈశ్వరప్ప, దేవరాజు, రవికుమార్, నరసింహరాజు ఆయనను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. రామచంద్ర మాట్లాడుతూ ఆర్ఇఎఫ్ జ్యోతిబాపూలే, అంబేద్కర్ ఆశయాలతో పనిచేస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ఉద్యోగుల సంక్షేమం కోసం అందరూ పని చేయాలని పిలుపునిచ్చారు.

### మానేపల్లిలో ఫ్రైడే-డ్రైడే

**ప్రజాశక్తి-లేపాక్షి**

మండలంలోని మానేపల్లి గ్రామపంచాయతీలో శుక్రవారం వైద్య ఆరోగ్య, సచివాలయ సిబ్బంది డ్రై డే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. దోమల నివారణకు మందులు పిచికారి చేశారు. మురుగునీటి కాలువలు, చెత్త కుప్పలను శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మల్లికార్జున, వెల్ఫేర్ సెక్రటరీ రవికుమార్, హెల్త్ సెక్రటరీ దుర్గా భవాని ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### సేవాభావం అలవర్చుకోవాలి

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

ప్రతి వ్యక్తి సేవా భావం అలవర్చుకున్నప్పుడే కుటుంబం, సమాజంలోనూ మంచి గుర్తింపు లభిస్తుందని శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్ నామా ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం రోగులు, వారి సహాయకులు 380 మందికి భోజనం, వాటర్ ప్యాకెట్లను వైద్యులు, నర్సులు చేత పంపిణీ చేశారు. అనంతరం గర్భిణులకు ప్రత్యేకంగా స్వీట్లు పంపిణీ చేశారు. నామా ప్రసాద్ మాట్లాడుతూ ఆవుల అభిరామ్ సహకారంతో వీటిని ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవి మాట్లాడుతూ శ్రీసత్యసాయి సేవా సమితి సేవలు ఎంతోమందికి స్ఫూర్తినిస్తాయన్నారు. కార్యక్రమంలో 27 మంది సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

### రావులచెరువులో అధికారుల గ్రామసభ

**ప్రజాశక్తి-ధర్మవరం రూరల్**

మండలంలోని రావులచెరువు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఇందులో 'గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక'పై పంచాయతీ అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. పంచాయతీలో ఇంటింటికీ తాగునీరు అందించే విషయమై చర్చించినట్లు సర్పంచి హైమావతి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ యల్లప్ప, సచివా లయ వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీధర్, ఆరోగ్య, అంగన్వాడీ కార్యకర్తలు టీచర్లు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

**ప్రజాశక్తి-బత్తలపల్లి**

ధర్మవరం మండలంలోని నాగులూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ దారపనేని రాధమ్మ శుక్రవారం మతి చెంది నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండలంలోని గంటాపురం గ్రామానికి చెందిన దారపనేని రాజప్ప, ఓబుళమ్మ దంపతుల కుమార్తె దారపనేని రాధమ్మ ప్రకృతి వ్యవసాయంలో డివిజనల్ ఇన్‌ఛార్జిగా పని చేసేవారు. గత సోమవారం ద్విచక్ర వాహనంపై ధర్మవరం నుంచి స్వగ్రామం వస్తుండగా నాగలూరు సమీ పంలో అదుపు తప్పి బైక్ బోల్తా పడడంతో తీవ్రంగా గాయపడింది. ఆమెను స్థానికులు హుటాహుటిన ఆర్‌డిటి ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురంలోని ఓ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందు తూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న ప్రకృతి వ్యవసాయానికి సంబంధిం చిన అధికారులు చైతన్య, రవీంద్ర, భానుమతి, వైసిపి జిల్లా కార్యదర్శి కోటి సురేష్, వైసిపి నాయకులు జాంపుల చంద్రమోహన్, పాల్యం అప్పస్వామి, టిడిపి నాయకులు నెట్టెం అశోక్, తదితరులు ఆ గ్రామం వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### దాడి కేసులో నిందితునికి రిమాండ్

**ప్రజాశక్తి-గుడిబండ**

మండలంలోని ఎస్.రాయాపురం గ్రామానికి చెందిన రామాంజప్ప పొలంలో అదే గ్రామానికి చెందిన బోయ భూతరాజు ఉద్దేశపూర్వకంగా 30 మేకలతో ప్రవేశించి కంది పంటను ధ్వంసం చేయడంతో పాటు ప్రశ్నించిన రామంజప్పను దాడి చేసి గాయపరిచాడు. రామంజప్ప భార్య రంగమ్మ ఫిర్యాదు మేరకు జనవరి 1వ తేదీ భూతరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజకుళ్లాయప్ప తెలిపారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం భూతరాజును అరెస్ట్ చేసి మడకశిర ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా 15 రోజులు రిమాండ్‌కు ఆదేశించారన్నారు. దీంతో భూతరాజును హిందూపురం సబ్ జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

### రైతువాణి క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-ధర్మవరం రూరల్**

ధర్మవరం రైతు సంఘం కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన రైతు వాణి క్యాలెండర్‌ను శుక్రవారం పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సిఐ రెడ్డప్ప ఆవిష్కరించారు. సిఐ రెడ్డప్ప మాట్లాడుతూ సమాజంలో ప్రజల పక్షాన ఉండి అనేక పోరాటాలు చేయడంతో పాటు రైతులు, శ్రామికుల కోసం న్యాయ పోరాటాలు చేసిన పార్టీకి సంబంధించి రైతువాణి క్యాలండర్‌ను ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఆలకుంట మారుతి, సిఐటియు నాయకులు జెవి.రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు నామాల నాగార్జున పాల్గొన్నారు.



రైతువాణి క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐ రెడ్డప్ప, తదితరులు